www.aknu.edu.in
nannayavani@aknu.edu.in
nannayanewstv
Adikavi Nannaya University
9701293231

విశ్వవిద్యాలయ స్థాయి తొలి తెలుగు వార పత్రిక

# నన్నయ వాణి

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

గౌరవ సంపాదకులు
ఆచార్య మొక్కా జగన్నాథరావు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య తుపాకుల అశోక్
కుల సచివులు

సంపాదకులు
డా.తలారి వాసు, సహాయాచార్య, తెలుగు శాఖ
పువ్వల ఆనంద్, ప్రజా సంబంధాల అధికారి, కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 2 | సంచిక : 19 | 14-02-2022 | పుటలు : 4


## విద్యార్థులను ఉన్నత ఆలోచనల వైపు నడిపించండి



యూనిట్ ని ప్రారంభిస్తున్న వీసీ

విద్యార్థుల శక్తి సామర్థ్యాలను తెలుసుకొని వారిని ఉన్నత ఆలోచనలవైపు నడిపించాలని, ఆచరణాత్మక విద్యలో విద్యార్థులను భాగస్వామ్యం చేయాలని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలోని ఆక్వాకల్చర్ విభాగ విద్యార్థుల ఆధ్వర్యంలో ఈకో బయోలాజికల్ స్టడీస్ ఆఫ్ ఆక్వాటిక్ ఎకోసిస్టమ్స్ యూనిట్ ఏర్పాటు చేసారు. సైన్స్ కాలేజ్ ఆవరణలో ఏర్పాటుచేసిన ఈ యూనిట్ ను వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు ప్రారంభించి ట్యాంక్ లో చేపలను,ఆహారాన్ని వేసారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ జల జీవన వ్యవస్థలో జీవజాలాలపై అధ్యయనం చేసేందుకు ఆక్వాకల్చర్ విద్యార్థులు ఏర్పాటు చేసిన యూనిట్ చాలా బాగుందని విద్యార్థులను అభినందించారు. ఈ యూనిట్ ద్వారా చేపల పెంపకంలో నేచురల్ ఫీడ్, ఆర్టిఫిషల్ ఫీడ్ లను ఉపయోగించినప్పుడు చేపల ఎదుగుదల ఏ విధంగా ఉంటుందో విద్యార్థులు అధ్యయనం చేస్తారని చెప్పారు. ఈ అధ్యయనం పూర్తిగా శాస్త్రీయ బద్ధంగా ఉంటుందని వేరు వేరు పరిస్థితుల్లో చేపలు ఏ విధంగా ఉంటున్నాయనే విషయాలను చేపల తెల్లరక్తకణాలు, ఎర్రరక్తకణాల సంఖ్య ఆధారంగా నిర్ధారిస్తారని తెలిపారు. విద్యార్థులను ప్రోత్సహిస్తూ ఆచరణాత్మక విద్యతో వారికి చక్కని మార్గనిర్దేశం చేస్తున్న అధ్యాపకులను అభినందించారు. తరువాత యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలోని అన్ని విభాగాధిపతులతో వీసీ సమీక్షను నిర్వహించారు. అధ్యాపకులంతా విద్యార్థులకు చక్కని మార్గనిర్దేశం చేయాలని అన్నారు. అన్ని విభాగాల డిపార్ట్మెంట్ స్టూడెంట్స్ క్లబ్స్, స్టూడెంట్ చాప్టర్స్ లను ఏర్పాటు చేయాలని చెప్పారు. వాటి ద్వారా విద్యార్థులకు, సమాజానికి అవసరమైన విద్య, విజ్ఞాన కార్యక్రమాలను నిర్వహించాలని తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థులకు ప్రాజెక్టులుగాను, పరిశోధనలుగాను, నూతన విజ్ఞానాన్ని అందిస్తాయని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.కె.రమణేశ్వరి, డా.ఎ.మట్టారెడ్డి, డా.పి.విజయనిర్మల, డా.డి.కళ్యాణి, డా.శ్రీధర్, ఆచార్య ఎస్.టేకి, డా.వి.పెర్సిస్, ఆచార్య వై.శ్రీనివాసరావు, డా.కె.వి.స్వామి, డా.కె.నూకరత్నం ఆయా విభాగాల అధ్యాపకులు పాల్గొన్నారు.



## మినిస్ట్రీ ఆఫ్ కల్చర్ జేసీని
## కలిసిన నన్నయ అధికారులు



జేసీ ఉమను కలిసిన నన్నయ ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.టేకి


**11.02.22 (మీడియాసెల్)** మినిస్ట్రీ ఆఫ్ కల్చర్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా జాయింట్ సెక్రటరీ ఎన్.ఉమ ను ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ కామర్స్ కాలేజ్ ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.టేకి మర్యాదపూర్వకంగా కలిసారు. రాజమహేంద్రవరం విచ్చేసిన జాయింట్ సెక్రటరీ ఎన్.ఉమను ఆర్.ఎండ్.బి గెస్ట్ హౌస్ లో ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.టేకి, తెలుగు అధ్యాపకులు డా.తలారివాసు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛా నందించారు. మినిస్ట్రీ ఆఫ్ కల్చర్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా సెంటర్ ను ఆంధ్రప్రదేశ్ లో ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. దీనిలో భాగంగా సాంస్కృతిక రాజధాని అయిన రాజమహేంద్రవరంలో చాళుక్య ద్వారంతో నన్నయ పేరుతో రాజరాజనరేంద్ర నగర్ గా విలసిల్లుతున్న ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా సెంటర్ ను ఏర్పాటు చేయాలని ఆచార్య ఎస్.టేకి కోరారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం భాష, సంస్కృతి, సాహిత్యాలకు అధిక ప్రాధాన్యాన్నిస్తుందని తెలియజేసారు. వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు మార్గదర్శకంలో విశ్వవిద్యాలయానికి ఐ.ఎస్.ఓ, ఎ.ఐ.సి.టి.ఇ. వంటి గుర్తింపులు తీసుకువచ్చారని త్వరలో నాక్ గుర్తింపును సాధిస్తున్నామని చెప్పారు. నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా సెంటర్ కు అవసరమైన వాతావరణం, ప్రాంగణం నన్నయ విశ్వవిద్యాలయంలో ఉందని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ ఇలాక్కియా.ఎస్. ఐ.ఎ.ఎస్, కమిషనర్ అభిషిక్త్ కిషోర్ ఐ.ఎ.ఎస్, డా.తలారివాసు అధికారులు పాల్గొన్నారు.

## ఇండక్షన్ ప్రోగ్రామ్‌కు నన్నయ ఇంజనీరింగ్ విద్యార్థులు



ఇండక్షన్ ప్రోగ్రామ్ కు వెలుతున్న విద్యార్థులు.

ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులను ఇండక్షన్ ప్రోగ్రామ్ లో భాగంగా లోకల్ విజిట్ కు తీసుకువెళ్ళారు. ఇంజనీరింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ డా.వి.పెర్సిస్ మాట్లాడుతూ ఎ.ఐ.సి.టి.ఇ. నిబంధనలలో భాగంగా డిపార్ట్మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ హ్యూమానిటీస్ వారు ఇండక్షన్ ప్రోగ్రామ్ ను నిర్వహిస్తున్నారన్నారు. ఇండక్షన్ ప్రోగ్రామ్ ఉద్దేశాలను విద్యార్థులకు వివరించారు. యూనివర్సిటీ బస్సులలో ఇంజనీరింగ్ విద్యార్థులు కడియపులంక నర్సరీలు, ధవళేశ్వరం కాటన్ బ్యారెజ్, రోడ్ కం రైల్ బ్రిడ్జ్, పుష్కరఘాట్, గౌతమి లైబ్రరీ, గోదావరి పుష్కరవనం వంటి ప్రాంతాలను సందర్శించారు. ఉభయగోదావరి జిల్లాలను సస్యశ్యామలంగా చేసిన ధవళేశ్వరం సర్ అర్థర్ కాటన్ బ్యారేజీ, మ్యూజియం లను చూసిన తరువాత సివిల్ ఇంజనీరింగ్ పై మరింత ఆసక్తి పెరిగిందని సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులు తెలిపారు. కడియపులంక నర్సరీలు, అఖండ గోదావరి వంటివి రాజమహేంద్రవరానికి ప్రత్యేకతలని ఇతర ప్రాంతాల నుండి వచ్చిన ఇంజనీరింగ్ విద్యార్థులు తమ అభిప్రాయాలను తెలియజేసారు. ఈ కార్యక్రమంలో కోర్సు కోఆర్డినేటర్ ఎం.బాలకృష్ణ, డా.జి.కీర్తిమరీట,కె.మౌనిక, డా.అప్పలరాజు,రాంబాబు, జి.లీనా తదితరులు పాల్గొన్నారు.



### మంచి మాట

ప్రేమంటే కళ్ళు మిరుమిట్లు గొలిపే ప్రవాహం
కాదు.నిత్యం ప్రవహించాల్సిన జీవధార!
పుట్టిన మనిషి చేయగలిగే పుణ్యకార్యం!
మరణం దాకా నిలుపుకోగలిగే మహత్వం!!

## సంపాదకీయం



# ప్రేమ

నీ విద్యుక్తధర్మాన్ని నీవు నిర్వర్తించటమే ప్రేమ అన్నాడో పెద్దమనిషి.ప్రేమిస్తే పోయేదేమీ లేదు.మహా అయితే తిరిగి ప్రేమిస్తారంతేనంటారో సినిమాకవి.

పుష్కలమైన ప్రాణవాయువు, కడుపునిండా భోజనం, బ్రతకటానికి కావలసిన సౌకర్యాలు, ధనం... ఉన్నంత మాత్రాన ఏ వ్యక్తి జీవితం కూడా పరిపూర్ణం కాదు.అవన్నీ సమకూరితే చాలా కాలం బతికేస్తాం అంతే! జీవించాలంటే మాత్రం, జీవితాన్ని ఆస్వాదించాలంటే మాత్రం ప్రేమ ఉండాల్సిందే. మనల్ని ప్రేమించే వాళ్ళు, మన చేత ప్రేమింపబడే వాళ్ళు ఉండాలి. అమ్మ,నాన్న,గురువులు,అన్న, తమ్ముడు, అక్క,చెల్లెలు,భార్య, భర్త, స్నేహితులు....ఇలా కొంతమంది ఉండాలి. లేదంటే 'దేశమును ప్రేమించుమన్నా' అన్నారు గురజాడ వారు.అదైనా ఉండాలి. దేశమంటే మనుషులే కదా!


ఎవరికి వారు పడుకునే పాటలాంటిది ప్రేమంటే. చుట్టుపక్కల వారికి అది ఆనందం కలిగించకపోవచ్చు.కానీ ఎవరిపాట వారికి మధురంగానే ఉంటుంది.ఈ ప్రపంచానికి మనం ఒక సాధారణమైన వ్యక్తి కావచ్చును.కానీ మనల్ని అభిమానించి,ప్రేమించే వ్యక్తులకు మాత్రం మనమే ప్రపంచం.

ఒకరిచేతి రాతను మళ్లీమళ్లీ చదువుతున్నా, ఒకరి కంఠస్వరాన్ని విన్నపుడు మళ్ళీ వినాలనే కోరిక కలుగుతున్నా, ఒకరి గురించి చెబుతున్నప్పుడు మనసు ఆనందం పొంది చిరునవ్వు కదలాడినా వారిని మీరు అభిమానిస్తున్నారని అర్థం. ఇదే అమలిన ప్రేమ సిద్ధాంతం. మలినం లేని స్వచ్ఛమైన ప్రేమ. ఈ సిద్ధాంత వేడికమీదనే రాయప్రోలు సుబ్బారావుగారు తృణకంకణం కావ్యం రాశారు కూడా.

మానవుడు సంఘజీవి అన్నారు అరిస్టాటిల్. అంతే కాదు మానవుడు బుద్ధిజీవో, డబ్బు జీవో మాత్రమే కాదు. ప్రాథమికంగా ప్రేమజీవి. ప్రేమ లేకపోతే బ్రతకలేడు. తనను ప్రేమించే వాళ్ళు కావాలి, లేదా తాను ప్రేమించే వాళ్ళు ఉండాలి.ఎవరూ ప్రేమించటం,అభిమానించటం లేదంటే అటువంటి ఊహ భరించలేం కూడా.

కరడుగట్టి నేర ప్రవృత్తి కలిగిన మనిషి సహచరి అనురాగంతో మంచి మనిషిగా మారిపోవటం, సామాన్యుడైన వ్యక్తి ప్రేయసి చొరవతో గొప్పవాడు కావటం.... ఇటువంటి కథలు పుస్తకాల్లో, సినిమాల్లో చూస్తూ ఉంటాం. మరి ఆ మాటకొస్తే రామాయణంలో సీతాస్వయంవర ఘట్టంలో శివధనుస్సును ఎక్కుపెడుతూ శ్రీరామునికి ఇది ఎత్తగలనా అని ఏమూలనో కొద్దిపాటి అపనమ్మకం కలిగితే సీత అందమైన వాలుజడ గుర్తుకొచ్చి ఇదే సాధించలేకపోతే రేపు అంతజడను పట్టుకొని సరసాలేం ఆడగలనని అనుకున్నాడట! ఎక్కడలేని శక్తి ఆయనలో ప్రవేశించి శివునివిల్లు ఫెళ్ళున విరిగి రామకథ ప్రేమకథగా మారిందట! ఇటువంటి సంఘటనలు భలే ఉంటాయి.కవి చమత్కారం సరదా అనిపిస్తుంది. ఇటువంటివన్నీ కూడా మనిషిలోని ప్రేమను పుట్టించేందుకే!ప్రేమను పండించేందుకే!!


# వీసీకి విద్యావేత్త శ్రీధర్ అభినందనలు



వీసీని సన్మానిస్తున్న శ్రీధర్, నాగేంద్ర కిషోర్.

శ్రీ షిరిడి సాయి మరియు డ్యాఫ్ నీ స్కూల్ చైర్మన్ తంబాబత్తుల శ్రీధర్ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య మొక్కా జగన్నాథరావుని కమ్యూనిటీ సైకాలజిస్ట్ స్పృహ సైకాలజీ పూర్వ విద్యార్థుల సంఘ అధ్యక్షులు సుంకర నాగేంద్ర కిషోర్ తో కలిసి, వైస్ ఛాన్సలర్ అందిస్తున్న అసమాన విద్యా సేవలకు, విశ్వవిద్యాలయానికి తీసుకుని వచ్చిన ఐ.ఎస్.ఓ.,ఏ.ఐ.సి.టి.ఇ. గుర్తింపులను గురించి, వివిధ అభివృద్ధి కార్యక్రమాల గురించి అభినందనలు తెలియజేసారు. తమ విద్యాసంస్థల ఆధ్వర్యంలో "విద్యార్థులకు హ్యూమానిటీస్ మరియు సోషల్ సైన్సస్ కోర్స్ ఉపయోగాలు, ఉపాధి అవకాశాలు" పై అవగాహన జాతీయసదస్సుకు ముఖ్యవక్తగా ఆచార్య మొక్కా జగన్నాథరావుని ఆహ్వానించారు. వైస్ ఛాన్సలర్ సైన్స్, టెక్నాలజీ అభివృద్ధితో పాటు, సాంఘిక, సామాజిక జీవన విధానంలో హ్యూమానిటీస్ ఆవశ్యకాన్ని, విద్యార్థుల కెరీర్ అవకాశాలు గురించి వివరించి సదస్సుపట్ల తమ సంసిద్ధతను తెలియ చేసారు. ఈ సందర్భంగా అతిథులకు యూనివర్సిటీ జ్ఞాపిక,క్యాలెండరు అందజేసారు.

# ఆచార్య ఎస్.టేకికి ఓ.ఎస్.డిగా నియామకం



టేకికి ఓ.ఎస్.డి.గా ఉత్తర్వులు అందిస్తున్న వీసీ

ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్ ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.టేకి ని ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ(ఓ.ఎస్.డి.)గా నియమించారు. యూనివర్సిటీలోని వీసీ కార్యాలయంలో వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు ఓ.ఎస్.డి. నియామకానికి సంబంధించిన ఉత్తర్వులను ఆచార్య టేకి కి అందజేసారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఓ.ఎస్.డి. గా ఆచార్య ఎస్.టేకి ని నియమించామని అన్నారు. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్ ప్రిన్సిపాల్ తో పాటు ఓ.ఎస్.డి. గా ఆచార్య ఎస్.టేకి బాధ్యతలు నిర్వహిస్తారని చెప్పారు. విశ్వవిద్యాలయ పరిపాలన వ్యవహారాలు, నాన్ టీచింగ్ సిబ్బంది పర్యవేక్షణ, విభాగాల పరిశీలన వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలియజేసారు. ఆచార్య ఎస్.టేకి మాట్లాడుతూ వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు తనపై పెట్టిన నమ్మకాన్ని కాపాడుకుంటూ విశ్వవిద్యాలయ అభివృద్ధిలో తనవంతు సహకారాన్ని అందిస్తానని తెలియజేసారు. విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు టేకి కి శుభాకాంక్షలను తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ పాల్గొన్నారు.

# తాడేపల్లిగూడెం కాంపస్‌లో స్వచ్ఛ భారత్ కార్యక్రమం



ఆదికవి నన్నయ యూనివర్శిటీ తాడేపల్లిగూడెం క్యాంపస్ కాలేజ్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ ఈక్విటీ, డైవర్సిటీ అండ్ ఇన్‌క్లూజన్ అనే థీమ్‌తో అంతర్జాతీయ మహిళలు మరియు బాలికల సైన్స్ దినోత్సవం సందర్భంగా ఫార్మసీ విద్యార్థులు స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో పాల్గొని కళాశాల ఆవరణతో పాటు సంబంధిత ల్యాబ్‌లు, తరగతి గదులను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో బి. ఫార్మసీ విద్యార్థినులు పి.కుసుమ, ఎస్.లోకేశ్, ఎన్.ఎస్.ఎస్.చీఫ్ కోఆర్డినేటర్ జె. కృష్ణంరాజు ఆధ్వర్యంలో స్వచ్ఛ్ భారత్ క్లబ్ అధ్యక్షతన నిర్వహించగా, సిబ్బంది డా.హీరా బట్టు, డా.సురేంద్రబాబు, ఎస్.లిఖిత,పి.అరుణ పాల్గొని ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం పట్ల విద్యార్థులను ప్రోత్సహించారు.



ప్రాంగణాన్ని శుభ్రం చేస్తున్న విద్యార్థులు




ప్రతిభా వాణి

# "నైటింగేల్ ఆఫ్ ఇండియా"

## సరోజినీ నాయుడు జయంతి

## (ఫిబ్రవరి 13)



సరోజినీ నాయుడు మంచి పద్య రచయిత్రి. చిన్నతనం నుంచీ ఆమెకు ఇంగ్లీషు భాషమీద చాలా ఇష్టం ఉండేది. ఇంగ్లీషు మాట్లాడాలని ఆమె ఎంతగానో ప్రయత్నిస్తూండేది. ఆ పట్టుదల, ధ్యేయాలతోనే ఇంగ్లీషు భాషను ఎంతో శ్రద్ధగా అభ్యసించింది. పదకొండో సంవత్సరం వచ్చేసరికి ఆమె అనర్గళంగా ఇంగ్లీషు మాట్లాడి అందరినీ ఆశ్చర్య చకితుల్ని చేసింది. ఆ వయసులోనే ఇంగ్లీషులో రచనలు ఆరంభించింది. సరోజిని నాయుడు పన్నెండవ ఏట మదరాసు విశ్వవిద్యాలయంలో మెట్రిక్యులేషన్ పూర్తి చేయగలిగిందంటే ఆమె చురుకైన తెలివితేటలూ, విద్య యందు ఆమెకు గల శ్రద్ధ మనం అర్థం చేసుకోవచ్చు.

హైదరాబాద్ నాంపల్లి రైల్వే స్టేషన్ కు దగ్గరలోని వీరి ఇంటిని సరోజినీ నాయుడుగారి తదనంతరం తమ ప్రసిద్ధ కవితా సంకలనమైన గోల్డన్ త్రెషోల్డ్ గా పేరు మార్చారు. ప్రస్తుతం ఇది హైదరాబాద్ యూనివర్శిటిగా రూపొందింది.

సరోజినీ పదమూడవ యేట చాలా పెద్ద రచన రచించింది. దానిపేరు సరోవరరాణి (Lady of Lake). అది పదమూడు వందల పంక్తులతో నిండిన అతి చక్కని రచన. తాను చెప్పదలచుకున్న విషయం ఇతరుల హృదయాలకు హత్తుకుని ఆలోచింపజేసే విధంగా చక్కటి శైలిలో ఉండేవి. చిన్న తనం నాడె రచనలు ప్రారంభించిన ఆమెలోని ప్రత్యేకతలు గ్రహించిన నిజాంనవాబు ఆమె యందు గల అభిమానంతో ఆమెను విదేశాలకు పంపాలని నిర్ణయించుకుని, ఆమె వివిధ శాస్త్రాలలో పరిశోధన చేసేందుకు ప్రోత్సాహమిస్తూ ఆమెకు ప్రతి సంవత్సరం నాలుగువేల రెండు వందల రూపాయలు విద్యార్థి వేతనంగా ఇచ్చేందుకు కూడా అంగీకరించాడు. నిజాం నవాబు ప్రోత్సాహం దొరికేసరికి, ఆమెకు చదువుమీదనున్న ఆసక్తి గ్రహించిన తల్లి దండ్రులు ఆమెను విదేశాలకు పంపారు. సరోజినీ లండన్ లోని కింగ్స్ కాలేజీ లోను కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయ అధ్వర్యంలోని గిర్టన్ కాలేజిలోనూ విద్యాధ్యయనం చేసింది.ఆమె రాసిన కవితలను చదివి, ఇంగ్లాండ్ లోని ఆంగ్లభాషా విమర్శకులు 'ఆర్థర్ సైమన్స్', ఎడ్వర్ గూస్ లు అభినందించారు. పాశ్చాత్య విద్వాంసులను చాలా మందిని కలసి వారికి గల పాండిత్యాన్ని ఆకళింపు చేసుకుని వారితో స్నేహసంబంధాలు పెంచుకుని వారి సలహాలపై, ఇంగ్లీషులో అతి చక్కని గ్రంథాలు వ్రాసింది. ఆమె రచించిన కావ్యాలలో "కాలవిహంగం" (Bird of time), "స్వర్గ ద్వారం" (The Golden Threshold), విరిగిన రెక్కలు (The Broken Wings) అనేవి చాలా ప్రసిద్ధమైనవి. ఆమె ఇంగ్లాండులో నివసిస్తూ రచనలు సాగించిన వాటిలో భారతీయ జీవితాలు మన జాతి ప్రత్యేకతలు కనబడేవి. సరోజినీ నాయుడు జయంతి సందర్భంగా నన్నయవాణి ఆమెకు అక్షర నీరాజనాన్ని సమర్పిస్తోంది.

# ఏయూ జియాలజీ విభాగంలో పాఠాలు చెప్పిన వీసీ జగన్నాథరావు


ఏయూలో జియాలజీ పాఠాలు చెబుతున్న వీసీ జగన్నాథరావు

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు సోమవారం ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి విశ్వవిద్యాలయ అభివృద్ధిపై పలు అంశాలను చర్చించారు. జియాలజీలో విద్యాబుద్ధులు నేర్పి, పరిశోధన వైపు మార్గనిర్దేశం చేసిన తమ గురువు ఆచార్య మొక్కా జగన్నాథరావును విద్యార్థులు జియాలజీ డిపార్ట్ మెంట్ కు ఆహ్వానించి పాఠం చెప్పాలని కోరారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఆంధ్ర విశ్వవిద్యాలయ జియాలజీ విభాగ గౌరవ ఆచార్యునిగా విభాగంలో విద్యార్థులకు పాఠాలు బోధించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. 'మినరల్ ఎక్స్ప్లోరేషన్' అనే అంశంపై విద్యార్థులకు పాఠాలు బోధించారు. దేశాభివృద్ధిలో జియాలజీ విభాగం విద్యార్థులకు ఎంతో బాధ్యత ఉంటుందని అన్నారు. జియాలజిస్టులకు ఖనిజ అన్వేషణ ప్రధానమైనదని చెప్పారు. శాస్త్రీయ, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఖనిజాలను అన్వేషించే విధానాలు విద్యార్థులకు తెలియజేశారు. దేశ ప్రగతిలో ఖనిజ సంపద ప్రధానమైనదని దానిని వెలికి తీసే బాధ్యత జియాలజిస్ట్ లపై ఉందని చెప్పారు. విద్యార్థులందరూ జియాలజీలో పట్టు సాధించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. విద్యార్థులు తన పై చూపించిన అభిమానానికి ఆనందాన్ని వ్యక్తం చేశారు.

# విద్యార్థులకు శారీరక వ్యాయామం తప్పనిసరి


విద్యార్థులకు క్రీడా సామగ్రిని అందిస్తున్న వీసీ జగన్నాథరావు


విద్యార్థులకు శారీరక వ్యాయామం తప్పనిసరిగా అవసరమని, శారీరక వ్యాయమంతోనే మానసిక ఉల్లాసం, విద్య, విజ్ఞానాలపై దృష్టి పెట్టేందుకు వీలుంటుందని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీలోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కు వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు ప్రోత్సాహంతో ప్రత్యేక క్రీడా సమాగ్రిని కొనుగోలు చేసారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక క్రీడా సౌకర్యాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో వీసీ హాజరై విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీలోని ఇంజనీరింగ్ కాలేజ్ కి ఎ.ఐ.సి.టి.ఇ. గుర్తింపును తీసుకువచ్చామని, ఇంజనీరింగ్ వర్క్ షాప్ భవనాన్ని నిర్మించామని, స్టూడెంట్ క్లబ్స్ ను ఏర్పాటు చేసామని, సాంకేతిక విజ్ఞానానికి సంబంధించిన పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని అన్నారు. దానిలో భాగంగా యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కు ప్రత్యేక క్రీడా సౌకర్యాలను కల్పించామని తెలిపారు. ఇంజనీరింగ్ విద్యార్థులను విద్యవైపు, క్రీడల వైపు నడిపించి వారి మానసిక వికాసానికి దోహదపడాలని అధ్యాపకులకు సూచించారు. ఇప్పటి వరకు ఇరవైమంది ఇంజనీరింగ్ విద్యార్థులు ఆల్ ఇండియా సౌత్ జోన్ పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. ఇంజనీరింగ్ విద్యార్థులకు అవసరమైన క్రీడా శిక్షణలను సమర్థవంతంగా అందించాలని మరిన్ని జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపిక కావాలని తెలిపారు. ఇంజనీరింగ్ విద్యార్థులకు కావల్సిన లాబ్స్ వంటి అన్ని వసతులను సమకుర్చుతున్నామన్నారు. త్వరలో ఇంజనీరింగ్ కాలేజ్‌కు ప్రత్యేక జిమ్ ను ఏర్పాటు చేస్తామన్నారు. విద్యార్థులంతా విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ఉన్న వసతులను సద్వినియోగం చేసుకొని విద్యలోను, క్రీడల్లోను రాణించాలని చెప్పారు. తరువాత యూనివర్సిటీ నాన్ టీచింగ్ సిబ్బందికి ఆయా స్కిల్స్ పై శిక్షణను అందించిన ఇంజనీరింగ్ కాలేజ్ అధ్యాపకులు ఎం.శ్రీనివాసరావు, బి.అహమ్మద్ ఆలీబాబా, దాసు లకు వీసీ సర్టిఫికెట్లు అందించారు. ప్రత్యేక క్రీడా సౌకర్యాలను కల్పించిన వీసీ ని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.వి.పెర్సిస్, డీన్ ఆచార్య పి.సురేష్ వర్మ, ఇంజనీరింగ్ కాలేజ్ స్పోర్ట్స్ ఇన్ చార్జ్ వి.సలోమాన్ దేవానంద్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# స్వేచ్ఛ స్టూడెంట్ క్లబ్ అక్ను లోగో ఆవిష్కరణ



స్వేచ్ఛ లోగోను ఆవిష్కరిస్తున్న వీసీ

**11.02.22 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ యూనివర్సిటీ లోని విద్యార్థులు స్వచ్ఛందంగా ఏర్పాటు చేసుకున్న స్వేచ్ఛ స్టూడెంట్ క్లబ్ అక్ను లోగోను శుక్రవారం నాడు ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథ రావు తన చాంబర్లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా క్లబ్ కోఆర్డినేటర్ కె.శ్యామ్ కుమార్ మాట్లాడుతూ ఈ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థుల్లో పొలిటికల్ సైన్స్, ఎకనామిక్స్ మరియు చరిత్ర వంటి సబ్జెక్టులలో అవగాహన కలిగేలా చర్చలు జరపడం, వివిధ ప్రభుత్వ పరీక్షలకు సిద్ధపడే విద్యార్థుల కోసం కరెంట్ అఫైర్స్ చర్చించటం, జాతీయ నాయకులు, సంఘసంస్కర్తల జయంతులు వర్ధంతులు జరపటం, వివిధ చర్చల ద్వారా వేదికలపై మాట్లాడటం నేర్పించటం, మోటివేషన్ క్లాసులు మోడల్ అసెంబ్లీ, యూత్ పార్లమెంట్ నిర్వహించడం, తెలుగు భాషా సాహిత్యాల యొక్క విశిష్టతను తెలియజేయడం, ఆంగ్ల భాషా ప్రావీణ్యమును అభివృద్ధి పరచడం, విద్యార్థుల నైపుణ్యం ప్రోత్సహించేందుకు బహుముఖ పోటీలు నిర్వహించబోతున్నట్లు వివరించారు. లోగో ఆవిష్కరణ అనంతరం వీసీ జగన్నాథరావు మాట్లాడుతూ తన వంతు ప్రోత్సాహం ఎప్పటికి ఉంటుందని, యూనివర్సిటీలో అన్ని కళాశాలల విద్యార్థులను కలుపుకుని పలు కార్యక్రమాలు కొనసాగించాలని ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సబ్ కో ఆర్డినేటర్స్ కె. నమ్రత, ఎస్. ఆదర్శ్, డి.అశోక్ కుమార్, వి.మౌనిక, డి.సంతోషి తదితరులు పాల్గొన్నారు.


ADIKAVI NANNAYA UNIVERSITY
MSN CAMPUS, KAKINADA

*Invitation*

We cordially invite you to the Inaugural Function of
AKNU MSN Campus Men's Hostel Building
On the 14th, February 2022
Time: 11.00 am, Venue : AKNU MSN Campus, Kakinada

**Chief Guest**
Sri KURASALA KANNABABU Garu
Hon'ble Minister for Agriculture, Cooperation,
Marketing and Food Processing, A.P

**Distinguished Guest**
Smt. VANGA GEETHA VISWANATH Garu
Member of Parliament, Kakinada

**Presided by**
Prof. MOKKA JAGANNADHA RAO Garu
Hon'ble Vice-Chancellor
Adikavi Nannaya University, Rajamahendravaram


**Guest of Honour**
Prof. T. ASHOK Garu
Registrar, AKNU - RJY

**Special Invitees**
Prof. S. TEKI Garu
Officer on Special Duty, AKNU - RJY
and
Sri BEJAWADA VEERA VENKATA SATYANARAYANA Garu
Sarpanch, Thimmapuram

M. Pochayya
Chief Warden

Dr. M. KAMALA KUMARI
Principal

# మనకు మనమే.. సమీక్షకులం



జీవితంలో మనం ఎన్నో ఉన్నత శిఖరాలు చేరుకోవచ్చు. కానీ,జీవితాంతం ఉన్నతంగా బ్రతుకుతామన్న గ్యారెంటీ నేడు లేకుండా పోయింది.ఎందుకంటే నేటి ప్రపంచ జనాభాలో పాతిక శాతం మంది తీవ్రమైన మానసిక సమస్యలకు, 20శాతం మంది సాధారణ మానసిక సమస్యలతో బాధపడుతున్నారని మానసిక శాస్త్రవేత్తలు అంటున్నారు.

శరీరం అన్న తర్వాత చిన్న చిన్న వ్యాధులు రావడం, మనసు, మెదడు ఉన్నతర్వాత సమస్యలు రావడం చారిత్రక సత్యం. మానసిక సమస్యల కారణంగానే ప్రపంచ అందగత్తె మార్లిన్ మన్రో, రూజ్వెల్ట్, హిట్లర్, చర్చిల్ మొదలైనవారు అంతం అయ్యారు.అసలు ఈ మానసిక సమస్యలకు కారణం ఏమిటని చర్చించుకుంటే... సమస్యను అధికంగా ఊహించుకోవడం, అతిగా స్పందించడం,లేని సమస్యను ఊహించుకోవడం అనేది మూలకారకాలుగా చెప్పవచ్చు. మానసిక వ్యాధులు కొని తెచ్చుకొని ఆ తర్వాత చికిత్సతో తగ్గించుకోవడం కన్నా అసలు ఆ సమస్యలు రాకుండా జాగ్రత్త పడటం మేలు.ఈ విధమైన దృక్పథం మనకు చిన్నప్పటినుంచి అలవాటు కావాలి.నేను ఎట్టి పరిస్థితుల్లోనూ స్థిరంగా, స్థిమితంగా ఆలోచిస్తానని ఎవరికి వారే సలహా ఇచ్చుకోవాలి.ఇటువంటి ప్రేరణ మనకు మనమే ఇచ్చుకోవడం అలవాటు కావాలి.

చాలామంది ఇతరుల గురించి, ఇతరుల విషయాల గురించి ఆలోచిస్తారు.కానీ మనగురించి మనం ఆలోచించుకొనం. అందువల్లనే మన శరీరానికే కాక మన జీవితానికి ఆరోగ్యకరమైన ఆలోచనావిధానానికి, ఆటంకం ఏర్పడుతుంది.జీవితం బాధాకరంగా తయారవుతుంది. అవమానాలకు,అవహేళనలకు గురవుతూ ఉంటాం.కావున అప్పుడప్పుడు మన మానసిక ధోరణినీ విశ్లేషించుకోవాలి.ఈ విధంగా మనం ఎవరికి వారే చిన్నప్పటినుంచే మానసిక విశ్లేషణ చేసుకుంటే సమాజంలో తలెత్తుకు తిరిగే ఉన్నత స్థితిలో నిలబడుగలుగుతాం.కాబట్టి ఉన్నత శిఖరాలకు చేరుకోవడానికి మీ కెరీర్ గురించి ఆలోచించినట్లే,ఉన్నతంగా బ్రతకడం కోసం కూడా ఆలోచించగలగాలి.మన కెరీర్ కోసం ఆలోచించే సమయంలో కనీసం పదోవంతు సమయమైనా మన గురించి మనం సమీక్షించుకోవాలి. అప్పుడే అటు మేధావులుగా, ఇటు మంచి వ్యక్తులుగా సమాజంలో ఉన్నత స్థానంలో ఉండటం జరుగుతుంది. కావున అందరూ తమతమ మానసిక సామర్థ్యాలు పెంచుకోవడానికి ఎవరికి వారే కృషి చేసుకోవాలి. అప్పుడే తమలోని బలాలను తెలుసుకొని జీవితంలో ముందుకు దూసుకుపోవటానికి సరైన మార్గదర్శకత్వం లభిస్తుంది.

బి.సుశాంత్ కుమార్,
బీఈడీ సెకండ్ ఇయర్, ఆదికవి నన్నయ యూనివర్సిటీ.

ప్రచురణ : మీడియా సెల్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం-రాజమహేంద్రవరం, ఈమెయిల్ :- nannayavani@aknu.edu.in